# శీతాద్రి శిఖరాన

**రచన:** శ్రీ బేతవోలు రామబ్రహ్మం గారు **రాగం:** ఖరహరప్రియ ఆధారం
**తాళం:** ఖండ చాపు
**గానం:** శ్రీ మంగళంపల్లి బాలమురళీకృష్ణ గారు

**పల్లవి:** శీతాద్రి శిఖరాన పగడాలు తాపించు
మా తల్లి లత్తుకకు నీరాజనం } -2
కెంపైన నీరాజనం, భక్తి పెంపైన నీరాజనం

**చరణం 1:** యోగీంద్ర హృదయాన మ్రోగేటి మా తల్లి
బాగైన అందెలకు నీరాజనం } -2
బంగారు నీరాజనం, భక్తి పొంగారు నీరాజనం

**చరణం 2:** నెలతాల్పు డెందాన వలపు వీణలు మీటు
మా తల్లి గాజులకు నీరాజనం } -2
రాగాల నీరాజనం, భక్తి తాళాల నీరాజనం

**చరణం 3:** మనుజాళి హృదయాల తిమిరాలు సమయించు
మా తల్లి నవ్వులకు నీరాజనం } -2
ముత్యాల నీరాజనం, భక్తి నృత్యాల నీరాజనం

**చరణం 4:** చెక్కిళ్ళ కాంతితో క్రిక్కిరిసి అలరారు
మా తల్లి ముంగరకు నీరాజనం } -2
రతనాల నీరాజనం, భక్తి జతనాల నీరాజనం

**చరణం 5:** పసిబిడ్డలను చేసి ప్రజనెల్ల పాలించు
మా తల్లి చూపులకు నీరాజనం } -2
అనురాగ నీరాజనం, భక్తి కనరాగ నీరాజనం

**చరణం 6:** దహరాన కనిపించు ఇనబింబ మనిపించు
మా తల్లి కుంకుమకు నీరాజనం } -2
నిండైన నీరాజనం, భక్తి మెండైన నీరాజనం

**చరణం 7:** తేటిపిల్లలు వోలె గాలి కల్లలనాడు
మా తల్లి కురులకు నీరాజనం } -2
నీలాల నీరాజనం, భక్తి భావాల నీరాజనం

**చరణం 8:** జగదేక మోహిని, సర్వేశ గేహిని
మా తల్లి రూపునకు నీరాజనం } -2
నిలువెత్తు నీరాజనం, (భక్తి విలువెత్తు నీరాజనం)
↳3